క్లుప్తంగా

గంగూరు చెరువు కట్ట మరమ్మతు చేయండి



పెనమలూరు: గంగూరులో ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్ట మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో స్థానికుడు షేక్ షాబుద్దీన్ గ్రామ పంచాయతీ అధికారులకు అర్జీ ఇస్తూ గతంలో చెరువు కట్ట కోతకు గురై ప్రమాదంగా మారిందని ఫిర్యాదు చేశానన్నారు. తాను ఫిర్యాదు చేసి ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని తెలిపారు. గంగూరు ప్రధాన రహదారి పక్కనే చెరువు ఉండటంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా చెరువు కట్టను పటిష్టం చేసి రివిట్‌మెంట్ చేయాలని కోరారు. గ్రామంలో దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరగడంతో రోడ్డు ధ్వంసమవుతోందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటానని పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ తెలిపారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: గొర్రెలు, మేకల్లో నట్టల వ్యాధి నివారణకు చేపట్టిన ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని పశుపోషకులు వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ బాపులపాడు ఏడీ డాక్టర్ ఎం.ప్రమీలారాణి అన్నారు. మడిచర్లలో మంగళవారం పశు సంవర్ధకశాఖ అధికారులు మేకలు, గొర్రెల మందల వద్దకే నేరుగా వెళ్లి నట్టల నివారణ మందును అందజేశారు. నట్టలతో కలిగే నష్టాలను, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రమీలారాణి పశుపోషకులకు వివరించారు. వర్షాకాలంలో పశువుల కాళ్లకు తరచుగా వచ్చే తెగుళ్ల నియంత్రణకు ముందస్తుగా పాటించాల్సిన జాగ్రత్తలను ఆమె తెలిపారు. మండలంలో 6482 గొర్రెలు, 1679 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అజ్మీరా రాజా తదితరులు పాల్గొన్నారు.

టెండర్లలో జాప్యం.. రోడ్డు అభివృద్ధికి గ్రహణం

- ఈడుపుగల్లు, ఉప్పలూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?
- రూ 3.50 కోట్ల నిధుల కేటాయింపు
- టెండర్లు కూడా పిలవని సర్కారు
- అధ్వాన రహదారితో ప్రజల అవస్థలు





ఈడుపుగల్లు, ఉప్పలూరు రోడ్డులో ఏర్పడిన భారీ గుంతల్లో నిలిచిన వర్షం నీరు ; కోతకు గురై అధ్వానంగా మారిన ఈడుపుగల్లు ప్రధాన రహదారి

కంకిపాడు: నిధుల మంజూరుతోనే ఆ రోడ్డు అభివృద్ధి నిలిచిపోయింది. దీనికి కారణం టెండర్లను పిలవడంలో జాప్యమే. దీంతో ఈడుపుగలు–ఉప్పలూరు రహదారి అభివృద్ధికి గ్రహణం పట్టింది. అగాధాల్లాంటి గోతుల రోడ్లతో ప్రజలు ప్రయాణమంటేనే ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి కష్టాలకు కేరాఫ్‌గా మారింది.

రోడ్డుకు మోక్షమేదీ?

విజయవాడ–మచిలీపట్నం కరకట్ట నుంచి కంకిపాడు–గన్నవరం రోడ్డును కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు మార్గం ఉప్పలూరు–మద్దూరు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ఈ రోడ్డు నరకానికి నకలుగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు, కోతకు గురైన రోడ్డు మార్జిన్లతో రాకపోకలు సజావుగా సాగక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డును పూర్తి స్థాయిలో డబుల్ లైన్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.19.50 కోట్ల నిధులు కేటాయించారు. ఎన్నికల కోడ్‌కు ముందు శంకుస్థాపన కూడా జరిగింది. పనులు ప్రారంభానికి కోడ్ అడ్డంకిగా మారింది.

కేవలం సింగిల్ లైన్‌కే..

తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ నిధులను రద్దు చేసింది. డబుల్ లైన్‌కు ప్రతిపాదించిన రోడ్డు మార్గాన్ని కేవలం సింగిల్ లైన్‌కే పరిమితం చేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పంపిన నివేదికలను ఆధారంగా చేసుకుని మద్దూరు–గోసాల, ఈడుపుగల్లు–ఉప్పలూరును రెండుగా విడదీసింది. తొలి దశలో ఈడుపుగల్లు–ఉప్పలూరు రోడ్డుకు రూ 3.50 కోట్లు నిధులు కేటాయించింది. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి కంకిపాడు–గన్నవరం రోడ్డును ఉప్పలూరు వంతెన వద్ద కలుపుతూ ఉన్న రోడ్డు మార్గం వరకూ రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో డబుల్ లైన్ కాకపోయినా, సింగిల్ లైన్‌కు ఆమోదం దక్కడం, నిధులు కేటాయించడంతో రహదారి ఇక్కట్లకు తెర పడుతుందని అంతా ఆశించారు.

నెలలు గడుస్తున్నా.. టెండర్లు పిలవరేం!

ఈ రోడ్డు అభివృద్ధికి నిధుల కేటాయింపులు జరిగి నెలలు గడుస్తోంది. ఈ వేసవిలో రోడ్డు నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అంతా భావించారు. వేసవి పూర్తై వర్షాకాలం కూడా వచ్చేసింది. వర్షాల్లో పనులు ముందుకు సాగే పరిస్థితి అంతకంటే లేదు. నేటి వరకూ కూటమి ప్రభుత్వం టెండర్లు కూడా పిలవలేదు. ఈ ప్రక్రియ జరిగితే పరిపాలనా ఆమోదంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుంది. కానీ టెండర్లు పిలవకపోవడంతో రోడ్డు అభివృద్ధికి మోక్షం ఎప్పుడు లభిస్తుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

ప్రయాణం నరకప్రాయం

రోడ్డు పనులు ముందుకు సాగని పరిస్థితి. ఇప్పటికే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. భారీ లోడు వాహనాల రాకపోకలతో అస్తవ్యస్తంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మార్జిన్లు కోతకు గురై ప్రయాణం ప్రమాదకరంగా తయారైందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్డులోని గోతుల్లో నీరు నిలిచి ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం భయంభయంగా..ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

టెండర్లు పిలవలేదు.. కారణం తెలీదు

రోడ్డు అభివృద్ధికి రూ 3.50 కోట్ల నిధులు కేటాయించారు. టెండర్లు పిలుస్తారు.. రోడ్డు నిర్మాణం వేసవిలో పూర్తవుతుందని అనుకున్నాం. కానీ టెండర్లు పిలవలేదు. దీనికి కారణాలు తెలీదు. ప్రభుత్వం దృష్టిలో సమస్య ఉంది. మద్దూరు–గోసాల రోడ్డు అభివృద్ధికి రూ.6.50 లక్షలతో అంచనాలను రూపొందించి పంపాం. టెండర్ల కోసం ఎదురు చూస్తున్నాం.

– మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కంకిపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు, ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు కరంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రసాదంపాడులోని ఆశ్రమం రోడ్డు, శాస్త్రి వీధి, ఆంధ్రాబ్యాంకు ఏరియా, వివేకానంద పాఠశాల రోడ్డు, ఎనికేపాడులో కొడాలివారి వీధి, డీ మార్ట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం ఈడుపుగల్లు శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు రెక్కీ నిర్వహించి దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభయాంజనేయుడి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం చేశారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని తమలపాకులతో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. దాతలు మూల్పూరు ధన కోటేశ్వరరావు (కొయ్యూరు) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



గన్నవరంలో సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెనమలూరు: కార్మికులు ఈ నెల 9వ తేదీన చేయనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా సీఐటీయూ కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరుతూ జిల్లా, మండల సీఐటీయు నేతలు కానూరు ఆటోనగర్‌లో మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు 10 కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అందరు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు వై.నరసింహారావు, మండల సీఐటీయూఅధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న, షేక్.కాశిం, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కంకిపాడు: కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కంకిపాడు, పునాదిపాడు, కోలవెన్ను గ్రామ పంచాయతీలు, ఉప్పలూరు పీహెచ్‌సీ, మండల విద్యాశాఖ, వెలుగు కార్యాలయంలో అధికారులకు మంగళవారం సమ్మె నోటీసులు అందించారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి తాడంకి నరేష్, మండల అధ్యక్షురాలు గుర్రం కుమారి, రైతు సంఘం జిల్లా కమిటీ నేత సీహెచ్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

గన్నవరం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ నెల 9వ తేదీ దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొంటారని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు గండికోట సమ్మక్క మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని చెప్పారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకుని మెనూ ధరలు కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు కళ్లం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతాబ్బాయి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకనుగుణంగా విద్యాబోధన



పెనమలూరు: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా పరిశ్రమలకు అనుగుణంగా అధ్యాపకులు బోధన చేయాలని ఐసీటీ అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ ఎం.ఎం. మహమ్మద్ ఫక్రుద్దీన్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ డేటాపై ఐదు రోజుల అధ్యాపకుల శిక్షణ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం ఏఐ పరిశ్రమల్లో అత్యంత అవసరమైన డేటా ఎనలటిక్స్ స్కిల్ మైక్రోసాఫ్ట్ పవర్ బీఐని ఉపయోగించి ఫలితాలు సాధించాలన్నారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్‌లు ఆర్.సత్యప్రసాద్, జి.రాజేష్, కె.సౌమ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాట్ల సమయంలో జాగ్రత్తలు పాటించండి



గంగూరులో జరిగిన పొలం పిలుస్తోందిలో రైతులు

పెనమలూరు: వరి నాట్ల సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి లంకా శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం గంగూరు, యనమలకుదురు గ్రామాల్లో నిర్వహించారు. ఏవో శ్రీనివాసరావు వివరాలు తెలుపుతూ డీఏపీ అందుబాటులో లేకపోవడంతో రైతులు నాట్లు వేసిన తర్వాత 14:35:14, 10:26:26, 20:20 రకం ఎరువులు వాడాలని సూచించారు. లేని పక్షంలో నానో డీఏపీ స్ప్రే చేయాలని సూచించారు. నారుమడి తీసే సమయంలో 3జీ గుళికలు వేయాలని దీంతో నాట్లు వేసిన తర్వాత కాండం తొలిచే పురుగు, ఆకుచుట్టు పురుగులు రాకుండా నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం అనర్థదాయకం

కంకిపాడు: రసాయన ఎరువుల వినియోగం అనర్థదాయకమని ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ యు.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మండలంలోని నెప్పల్లి, కుందేరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త విజయ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సాగుపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి బాబూరావు, కుందేరు సర్పంచ్ కలకోట రాధిక, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆముదాలపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి, వేమండ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రమేష్ నేతృత్వంలో వరి నారుమడులను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నారుమడి దశ నుంచే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో ఆరోగ్యకరమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. అనంతరం ఇందుపల్లి పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీకి ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు సుశీల, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నున్న గ్రామ సభలో సమస్యల ఏకరవు

నున్న(విజయవాడరూరల్): నున్న పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామసభలో గ్రామస్తులు సమస్యలను ఏకరవు పెట్టారు. మంచినీటి చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి రూ.1.50 లక్షలు పంచాయతీ చెల్లించి పది నెలలు దాటుతున్నా ఇంతవరకు నిర్మించలేదని ఏఎంసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత దండు సుబ్రహ్మణ్యం రాజు అడిగారు. చెరువు సమీపంలో వైన్ షాపు ఉండటంతో మద్యం సేవించిన వారు మంచినీటి చెరువు కట్టపై పడిపోవడం, వాకింగ్ చేస్తున్న మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. గ్రామంలో మైక్రో ఫిల్టర్ ద్వారా మంచినీరు ఫిల్టర్ కావడం లేదని, స్లంప్ మరమ్మతులకు నోచుకున్నా గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదన్నారు. చెరువు సెంటర్ నుంచి పంట కాల్వ వరకు డ్రైనేజీ నిర్మించాలని యర్కారెడ్డి మల్లారెడ్డి అడిగారు. నరసింహస్వామి గుడి రోడ్డు పల్లంగా ఉండటంతో ఎప్పుడు వర్షం వచ్చినా వర్షం నీరు రోడ్డుపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికుడు శ్రీనివాసరావు అడిగారు. సుగాలీ కాలనీలో డ్రైనేజీ సిస్టమ్ అధ్వానంగా ఉండటంతో ప్రజలు పాట్లు పడుతున్నారని బ్రహ్మం అడిగారు. 6వ వార్డులో మినీ వాటర్ ట్యాంక్ నిర్మించాలని వార్డు సభ్యుడు యర్కారెడ్డి వెంకటరెడ్డి అడిగారు. 12వ వార్డు సభ్యురాలు గుడిసె నాగేంద్రమ్మ, మరో సభ్యుడు దాసరి కిరణ్ వార్డు ల్లో పలు సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. సమస్యలను ప్రాధాన్యత, ఆర్థిక పరిస్థితి మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. ధాన్యం అమ్మిన రైతులకు ఇంకా రూ. 66 లక్షలను ప్రభుత్వం చెల్లించాలని రైతులు చెప్పారు. పలు శాఖల ఉద్యోగులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ





పెనమలూరు: తాడిగడప మున్సిపాలటీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం పంపిణీ చేశారు. పోరంకి సుగాలి కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ నజీర్ పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, యాళ్ల చక్రవర్తి పలువురు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం గ్రామంలో మంగళవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పెన్షన్‌లు పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలో కొత్తగా 132 స్పౌజ్ పెన్షన్‌లు మంజూరయ్యాయని చెప్పారు. ఎంపీడీవో స్వర్ణలత, కూటమి నేతలు పాల్గొన్నారు.

వైద్య వృత్తి.. పవిత్రమైన సేవ



హనుమాన్‌జంక్షన్ రూరల్: వైద్యం అంటే కేవలం వృత్తిగా భావించకుండా పవిత్రమైన సేవగా తలంచినప్పుడే ప్రజల మన్ననలు పొందగలమని డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్ క్లబ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు 11 మంది డాక్టర్లను సత్కరించారు. ప్రజలకు వారు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల చక్రవర్తి, కార్యదర్శి మాకినేని శ్రీనివాస్, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు, సీనియర్ సభ్యులు మేడికొండ బుచ్చిబాపయ్య, నందూరు సత్యవెంకటేశ్వర శర్మ, నందిగం స్వామి, మత్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.